క్లుప్తంగా

పథకాలే జగనన్నను మళ్లీ సీఎంను చేస్తాయ్!



కరపత్రాలు పంపిణీ చేస్తున్న వెంకట్‌రెడ్డి, మహేంద్రరెడ్డి తదితరులు

గూడూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెడుతున్న ప్రజా సంక్షేమ పథకాలే, మళ్లీ ఆయన్ని సీఎంను చేస్తాయని విందూరు ఎంపీటీసీ సభ్యుడు వెంకట్‌రెడ్డి అన్నారు. గూడూరు రూరల్ పరిధిలోని నెల్లటూరులో ఆదివారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ స్టిక్కర్లు అంటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేంద్రరెడ్డి, కోటేశ్వరరావు సుధ, శరణ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన నిర్మాణానికి కృషి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వెంకటగిరి: అంబేడ్కర్ ధర్మ పోరాట సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని క్రాస్‌రోడ్డులో ప్రభుత్వం నుంచి స్థలం కోరి అంబేడ్కర్ భవన నిర్మాణానికి కృషి చేస్తామని ఆ సమితి నాయకులు గుండోలు గోపాల్, ఎన్ శంకర్ తెలిపారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం ఏడీపీఎస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరి, న్యాయవాది రాంప్రసాద్, భాస్కర్, సుబ్బరామయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం



పూజలు చేస్తున్న భక్తులు

వెంకటగిరి: సమరత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని బొప్పాపురం సాలెకాలనీ వరసిద్ధి వినాయస్వామి ఆలయం ఆవరణలో ఆదివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణాల నడుమ హోమం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ ఫౌండేషన్ జోనల్ ఇన్‌చార్జి అద్దంకి విజయలక్ష్మి, శ్రీనివాసరెడ్డి, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేజే ప్రకృతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన సత్రానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సాయికుమార్ రెడ్డి దంపతులు

చిట్టమూరు: మల్లాంలోని సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన సత్రం నిర్మాణానికి ఆదివారం ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ చిల్లకూరు సాయికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. చైర్మన్ మాట్లాడుతూ ఆలయం వెనుక పూలతోటలో రూ.50 లక్షలతో నిత్యాన్నదాన సత్రం, గోశాల, వాహన మండపాలు నిర్మిస్తున్నామన్నారు. మల్లాం గ్రామానికి చెందిన దువ్వూరు హనుమంతరామిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు దువ్వూరు శేషురెడ్డి కుటుంబ సభ్యులు రూ.40 లక్షలు విరాళం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆలయ అర్చకుడు మూలం రాజు భానుప్రకాష్ పాల్గొన్నారు.

పిరమిడ్ అద్భుత శక్తి క్షేత్రం



ధ్యాన కార్యక్రమంలో పాల్గొన్న ధ్యాన గురువులు పరిణీత పత్రి, బాలకృష్ణ

నాయుడుపేటటౌన్: పిరమిడ్ అంటే కంటికి కనిపించే నాలుగు సమాన త్రిభుజాలను కలిపి చేసిన నిర్మాణం మాత్రమే కాదని, అది ఒక అద్భుత శక్తి క్షేత్రమని బ్రహ్మర్షి పత్రిజీ కుమార్తె పరిణీత పత్రి, కడ్తాల్ కైలాసపురి ట్రస్టు సభ్యులు బాలకృష్ణ అన్నారు. పట్టణంలోని రజక కాలనీలో నూతనంగా నిర్మించిన మిత్రబంధు పిరమిడ్ ధ్యాన మందిరాన్ని ఆదివారం వారు ప్రారంభించారు. పిరమిడ్‌లో ధ్యానంతో కలిగే లాభాలపై సందేశమిచ్చారు. భీమవరం నగరానికి చెందిన ధ్యాన రత్న పిప్పళ్ల ప్రసాద్‌రావు బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆధ్యాత్మిక సంగీత విభావరి అందరిని ఆకట్టుకుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పిరమిడ్ ధ్యాన మందిరం వద్ద పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పిరమిడ్ ధ్యాన మందిరంలో రోజూ ఉచిత ధ్యాన తరగతులు నిర్వహించనున్నట్లు మైత్రేయ బుద్ధ పిరమిడ్ ధ్యాన సేవా ట్రస్టు సభ్యులు తెలిపారు. హైదరాబాద్, తిరుపతి, నెల్లూరు తదితర ప్రాంతాల చెందిన ధ్యాన గురువులు పాల్గొన్నారు.

సరదా.. కారాదు సంకటం!

వేసవి.. ఎవరికైనా కాసేపు నీటిలో సేద తీరాలన్న ఆలోచన వస్తుంది. పైగా ప్రస్తుతం సెలవుల నేపథ్యంలో నీరు కనిపించగానే సరదాగా గడుపుదామని దిగుతున్నారు. వనరుల లోతు గురించి.. అందులోకి దిగొచ్చా..లేదా అని ఆలోచించడం లేదు. ఈ చర్యే వారి ప్రాణాలు తోడేస్తోంది. ఈ క్రమంలోనే వివిధ ప్రాంతాల్లో ఈత కోసం వెళుతున్న పలువురు మృత్యువాత పడుతున్న ఘటనలు జరుగుతున్నాయి. మరింత మంది అలా కాకుండా జాగ్రత్త పడాల్సి ఉంది.

- జలాశయాల్లో ఈతకు వెళుతున్న యువత, విద్యార్థులు
- నెలలో 9 మంది మృత్యువాత



సిలికా గుంతల్లో ఈత కొడుతున్న యువకులు

చిల్లకూరు: వేసవి ప్రారంభమైంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండలు మండుతున్నాయి. చిన్నారులకు వేసవి సెలవులు సైతం ఇచ్చేశారు. దీంతో వేసవి తాపం తీర్చుకోవడానికి చిన్నారులు, యువకులు ఈత కొట్టడానికి మొగ్గు చూపతున్నారు. ఈ క్రమంలో గుంటలు, చెరువులు, బావులు వాగులులోకి దిగుతున్నారు. స్నేహితులతో కలసి సరదా కొందరు ఈతకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా వ్యవహరించి, పిల్లలను కట్టడి చేసేందుకు ప్రయత్నించాల్సి ఉంది. అలా చేయడంతో పిల్లలను కాపాడుకోగలిగిన వారవుతారు. గూడూరు నియోజకవర్గంలో గూడూరు సమీపంలో పంబలేరు, చిల్లకూరు మండలంలో బావులు, తీర ప్రాంతంలో సిలికా గుంతలు, కోట మండలంలో చెరువులు, సిలికా గుంతలు, వాకాడు మండలంలో సముద్ర తీరం, వాగులు, చిట్టమూరు మండలంలో నీటి గుంతలు, చెరువులు ఎక్కువగా ఉన్నాయి. దీనికి తోడు ఇటీవల తెలుగు గంగ కాలువలో రెండో పంట కోసం నీటిని విడుదల చేయడంతో కాలువలో నిండుగా నీరు ప్రవహిస్తోంది. దీంతో చిన్నారులు, యువకులు ఈత కొట్టేందుకు మక్కువ చూపుతున్నారు. నీటి వనరుల్లోకి దిగి మృత్యువాత పడుతున్నారు. సరదాగా వెళ్లి, నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఈ ప్రమాదాలు సంభవించి పలువురు మృత్యువాత పడ్డారు.

నిదర్శనాలివీ

- గూడూరు సమీపంలోని పంబలేరు వాగులో ఇటీవల ఈత కోసం దిగిన ముగ్గురు మృత్యువాత పడ్డారు.
- చిల్లకూరు మండలంలోని బల్లవోలులో స్నేహితులతో కలసి గతంలో ఈతకు వెళ్లి సిలికా గుంతలో పడి ఓ యువకుడు మృత్యువాత పడ్డాడు.
- అన్నంబాక సమీపంలో ఓ యువకుడు ఈతకు వెళ్లి బావిలో దిగి మృత్యువాత పడ్డాడు.
- తీపనూరులో బావిలో దిగి ఓ యువకుడు మృతి చెందాడు.
- చిట్టమూరు మండలం బురదగలిలోని నీటి గుంతలో పడి ఓ విద్యార్థి మృత్యువాత పడ్డాడు.
- వాకాడు మండలం ముట్టేంబాక గ్రామ సమీపంలో ఈత కోసం వెళ్లి ఓ యువకుడు మృత్యువాత పడ్డాడు. అలాగే దుగ్గరాజపట్నం సమీపంలో నీటి గుంతలో పడి మరో యువకుడు మృత్యువాత పడ్డాడు.

అవగాహన కల్పిస్తున్నాం



తీర ప్రాంతంలోని సిలికా గుంతల్లో నీరు ఎక్కువగా ఉండడంతో యువకులు ఈతకు వెళుతుంటారు. అలాంటి వారిని గుర్తించి ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నాం. అలాగే గ్రామాల్లోని నేల బావులను గుర్తించి, అక్కడ కూడా ప్రమాదాలపై హెచ్చరికలు చేస్తున్నాం.

\- గోపాల్, ఎస్‌ఐ, చిల్లకూరు

ప్రగతి పథంలో ఆంధ్రప్రదేశ్



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

నాయుడుపేటటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చిలమాత్తురులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవయ్య ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం సంక్షేమ పథకాలను వివరించి, ఇప్పటివరకు వారు పొందిన పథకాలను గురించి వివరించి, బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ప్రజా సమస్యలను తెలుసుకుని కొన్నింటిని అక్కడిక్కడే పరిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ కుల మతాలకతీతంగా ప్రభుత్వ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కట్టా వెంకటరమణారెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డి, ఓట్టూరు కిషోర్ యాదవ్ ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి, బైనా మల్లికార్జునరెడ్డి, కటకం జయరామయ్య, శ్రీధర్ రెడ్డి, దుప్పల రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాబు పల్లకి మోసే బోయిగానే పవన్‌కల్యాణ్

దిశానిర్దేశం లేకుండా చంద్రబాబు పల్లకి మోసే బోయిగానే పవన్ కల్యాణ్ మిగిలిపోతాడని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆరోపించారు. చిలమాత్తురులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఏమి చేయాలో తోచక ప్రతి పక్షం వెన్నులో వణుకుపుడుతుందన్నారు. ఫ్యాన్ గాలికి తమ పార్టీలు కొట్టుకు పోతాయని పొత్తులపై పరుగులు పెడుతున్నట్లు ఎద్దేవా చేశారు.

మహోన్నతులు డాక్టర్ సీఆర్‌రెడ్డి



సంతాప సభ పాల్గొన్న ప్రముఖులు

గూడూరు: డాక్టర్ సీఆర్‌రెడ్డి మహోన్నతులని ప్రముఖ సీనియర్ వైద్యులు చంద్రహాస్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రగతి సేవా సమితి ఆధ్వర్యంలో డాక్టర్ సీఆర్‌రెడ్డి సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డబ్ల్యూ కళాశాల ప్రిన్సిపల్ హనుమంతరావు, సంస్థ అధ్యక్షుడు కే చంద్రశేఖర్, ఎం మురళీరెడ్డి, శ్రీనివాసులగౌడ్, సుబ్రమణ్యం, మన్మధరావు, శ్రీనివాసులు, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీతపై ప్రచారం



భగవద్గీతపై ప్రచారం చేస్తున్న ప్రభోద సేవా సమితి సభ్యులు

రాపూరు: మండలంలోని గోనుపల్లె, గరిమెనపెంట, పెనబర్తి గ్రామాల్లో ఆదివారం త్రైత సిద్ధాంత భవద్గీత జ్ఞాన గ్రంథాలపై ప్రచారం నిర్వహించినట్లు ప్రభోద సేవా సమితి అధ్యక్షుడు పెంచలనరసయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పెంచలయ్య, కిషోర్, మధు, గాయత్రి, కొండయ్య, భాగ్యమ్మ, నాగరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే మైనారిటీల సంక్షేమం



మాట్లాడుతున్న మగ్దూం మోహిద్దీన్

గూడూరు: ముస్లిం మైనారిటీల సంక్షేమం కోరే పార్టీ ఒక వైఎస్సార్ సీపీనే అని ఆ పార్టీ మైనార్టీ విభాగం కార్యదర్శి మగ్దూం మోహిద్దీన్ పేర్కొన్నారు. పట్టణంలోని దర్గా ప్రాంగణంలో ఆదివారం వైఎస్సార్ సీపీ ముస్లిం నేతలు సమావేశం నిర్వహించారు. తొలుత ముస్లింలు జగన్‌మోహన్‌రెడ్డే మళ్లీ సీఎం కావాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమాన్ని, అభివృద్ధిని రెండు కళ్లలా చూస్తున్నారన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వి జలీల్, కార్యవర్గ సభ్యుడు కాలేషా, యువ నాయకులు షబ్బీర్, బాబు, యస్దానీ, షాకీర్, కరీముల్లా, మోహ్మద్ బాసిత్ పాల్గొన్నారు.

సామాజిక సేవలోనూ ముందుండాలి



విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

గూడూరు: విద్యార్థులు విద్యతోపాటు, సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ముందుండాలని డీఆర్ డబ్ల్యూ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రమణమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని డీఆర్‌డబ్ల్యూ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణ సమీపంలోని నెల్లటూరు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు కుమ్మరవీధిలోని నారాయణ దంత వైద్యశాల సౌజన్యంతో ఉచిత దంత వైద్య పరీక్షలు చేయించారు. కళాశాల అధ్యాపకులు వెంకటరమణయ్య పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య



వృద్ధుడి మృతదేహం

నాయుడుపేటటౌన్: పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి సమీపంలో వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం సాయంత్రం వెలుగు చూసింది. ఎస్‌ఐ శ్రీకాంత్ కథనం మేరకు.. గుర్తు తెలియని వ్యక్తి శవం ఉందని సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. శవం వద్ద ఆధారాల కోసం పరిశీలన చేశారు. చెట్ల మధ్యకు వెళ్లి మద్యంలో పురుగుల మందు కలిపి తాగిన ఆనవాళ్లను ఎస్‌ఐ గుర్తించారు. సుమారు 65ఏళ్ల వయసుండి, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. లైట్ కలర్ షర్టు, కట్ బనియన్ తీసి పక్కనే వేసి ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాల మార్చురీలో భద్రపరచినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

ఘనంగా పోలేరమ్మ జాతర ప్రారంభం



పోలేరమ్మ ఆలయం పూజలు చేస్తున్న నిర్వాహకులు

నాయుడుపేటటౌన్: గ్రామదేవత పోలేరమ్మ జాతర ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా పోలేరమ్మ ఘటానికి దేవాదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో నిర్వాహకులు పూజలు చేశారు. తొలుత శెట్టిపల్లివారివీధిలోని పోలేరమ్మ అలంకార గుడి వద్ద గ్రామపెద్దలతో పాటు పెద్ద కాపు అరవభూమి శ్రీనివాసులురెడ్డితో పాటు పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ గంధవల్లి సిద్ధయ్య, కమిటీ సభ్యులు, స్థానిక దేవదాయ శాఖ అధికారులు, తదితరులు కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఘటాన్ని పట్టణ సరిహద్దులో ఊరేగించారు. అలాగే పోలేరమ్మ ఆలయం వద్ద భక్తులకు అంబళ్లు పంచిపెట్టారు. కాగా పోలేరమ్మ జాతరకు దేవాదాయశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, ఆకులు కుబేరు మణి, శేషగిరి, మెస్ భాస్కర్‌రెడ్డి, గాదిరెడ్డి గోపి, బీఎల్ శ్రీనివాసులు, పసల హరిబాబు, నల్లబోతుల రామారావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి సీఎం చేసుకుందాం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న మహేంద్రరెడ్డి

గూడూరురూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా చేసుకుందామని, అందుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి ఊటుకూరు మహేంద్రరెడ్డి పిలుపునిచ్చారు. నెలటూరులో ఆదివారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించి, కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ప్రతి ఇంటికి స్టిక్కర్లు అంటించారు. ఈ కార్యక్రమంలో విందూరు ఎంపీటీసీ సభ్యుడు బొమ్మిరెడ్డి వెంకటరెడ్డి, నాయకులు సుధా, కోటి, చరణ్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కన్యకాపరమేశ్వరి జయంతి



కలశాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న మహిళలు



రాపూరులో..

గూడూరు: పట్టణంలోని గాంధీబొమ్మ కూడలిలో ఉన్న కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జయంతి ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. స్థానిక మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో 102 కలశాలను ఏర్పాటు చేసి, వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ మహిళలు ఊరేగింపుగా కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం కలశాలకు జలాభిషేకాలు చేశారు. భక్తులు వాసవీ నామ స్మరణ చేస్తూ, ప్రత్యేక పూజలు చేసి, అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రాపూరులో గ్రామోత్సవం

రాపూరు: మండలకేంద్రంలోని ఆర్యవైశ్యులు ఆదివారం కన్యకపరమేశ్వరి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు 102 కలశాలను మహిళలు ఊరేగింపుగా గ్రామోత్సవం నిర్వహించారు. 10 గంటలకు కలశాల్లోని జలాలతో అమ్మవారికి అభిషేకం, సాయంత్రం 7 గంటలకు తొమ్మిది సార్లు మణి ద్వీపవర్ణన, పారాయణం చేసినట్లు ఆలయ చైర్మన్ కొల్లు మధుసూదన్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అత్యధిక మంది ఆర్యవైశ్యులు పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేడు ఆర్బీకే, హెల్త్ క్లినిక్ ప్రారంభం

ఓజిలి: మండలంలోని చిలమానుచేనులో నిర్మించిన రైతుభరోసా కేంద్రం, డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్‌క్లినిక్‌ను ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సోమవారం ప్రారంభించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు జీ రవీంద్రరాజు తెలిపారు. అనంతరం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు.

ఇళ్లకు భూమిపూజ

వాకాడు: మండలంలోని జగనన్న లేఅవుట్లలో ఆదివారం వాకాడు ఉప సర్పంచి పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి ప్రోత్సాహంతో సుమారు 20 ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు భూమిపూజ చేశారు. వాకాడు బీసీ కాలనీ, గొల్లపాళెం, టెంకాయతోపు లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు.

వేడుకగా ఆరాధన మహోత్సవం

వెంకటగిరి:పట్టణంలోని రాధాకృష్ణ మందిరంలో ఉన్న బ్రహ్మంగారి ఆలయం వద్ద ఆదివారం స్వామివారి ఆరాధన మహోత్సవం వేడుకగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేకపూజలు చేశారు. భజనలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

సమైక్య ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి

కోట: సమైక్య మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి బలోపేతానికి కృషి చేస్తామని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు గోపాల్ అన్నారు. ఆదివారం కోటలో ఆ సమితి సమావేశం నిర్వహించారు. మాదిగలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. జిల్లా అధ్యక్షుడిగా ఆత్మకూరు నాగేంద్ర మా దిగను నియమిస్తున్నట్లు ప్రకటించారు.

పరిసరాల శుభ్రత అవసరం

వాకాడు: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందని వాకాడు పీఎస్ఎస్ అధ్యక్షుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి పేర్కొన్నారు. జాతీయ సేవా పథకం ద్వారా ఆరు రోజులుగా విద్యానగర్ ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మండలంలోని బాలిరెడ్డి పాళెంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు ఇన్నమాల రమణమ్మ, ఎం విజయకుమార్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ఎం రామకృష్ణారెడ్డి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ గాది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యాబోధనే లక్ష్యం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఏఎంఓ

సైదాపురం: విద్యార్థులకు ఉచిత నాణ్యమైన విద్యాబోధనే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా విద్యాశాఖ ఏఎంఓ అధికారి సుధీర్‌కుమార్ అన్నారు. మండలంలోని కలిచేడులో ఉన్న మైకా కార్మిక సంక్షేమ సంస్థ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన సరస్వతీదేవి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఎంపీపీ పలుగోటి పెంచలమ్మ, సర్పంచ్ కె సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం జరిగిన పాఠశాల వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లు, జగనన్న గోరుముద్ద, విద్యా కానుక, వసతి దీవెన వంటి పథకాలను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో నేతలు గుమ్మడి వీరాస్వామి, హెచ్ఎం బాలకృష్ణ, హరిప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు



విద్యుత్ దీపాల వెలుగులో ఆలయం

చిల్లకూరు: మండలంలోని కలవకొండలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు ఆలయ పాలక మండలి, దేవాదాయశాఖాధికారులు నిర్ణయం తీసుకున్నారు. కొండపై ఉన్న లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను ఒకటో తేదీన నుంచి 6వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఒకటో తేదీన అంకురార్పణ, 2న తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం, శేషవాహన సేవ, 3న హనుమంతు సేవ, 4న లక్ష్మీనరసింహస్వామి వారి జయంతిని పురస్కరించుకుని అన్నదానం, గరుడవాహనసేవ, 5న స్వామి అమ్మవార్ల కల్యాణ మహోత్సవం, అన్నదానం, గజవాహనసేవ, 6న చక్రస్నానం, ఏకాంత సేవతో బ్రహోత్సవాలు ముగింపు జరుగుతుందని ఆలయ ఈఓ నవీన్‌కుమార్, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కందల ఆనంద్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించి, స్వామివారి కృపకు పాత్రుల కావాలని కోరారు.

ద్వితీయ వర్ధంతి



స్వర్గీయ శ్రీ సిద్దారెడ్డి జనార్ధన్ రెడ్డి గారు

జననం: 20-08-1937 మరణం: 01-05-2021

అందరిమేలు కోరే ధన్యజీవి మీరు. ఆప్యాయతతో అందరి మనసులలో సుస్థిరస్థానం సంపాదించి, కుటుంబ ఉన్నతి కోసం అహర్నిశలు కృషి చేసిన మీరు స్వర్గస్తులై నేటికి 2 సంవత్సరము గడచిననూ మా హృదయాలలో మెదలుతూనే ఉన్నారు. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య: S. ఇంద్రసేనమ్మ

కుమారుడు - కోడలు

S.V.సుధీర్ రెడ్డి - S. ప్రణతి

మనుమరాలు: S.శ్రేష్ఠ

ప్రముఖ పారిశ్రామికవేత్త, గ్రానైట్ రంగ చక్రవర్తి శ్రీ సిద్దారెడ్డి జనార్ధన్‌రెడ్డి గారి ద్వితీయ వర్ధంతిని తేది: 01.05.2023 సోమవారం ఉదయం 10 గంటలకు సైదాపురం మండలం ఊటుకూరు గ్రామ సమీపంలో ఉన్న వారి స్వంత మామిడి తోటలో నిర్వహిస్తున్నట్లు వారి ధర్మపత్ని శ్రీమతి సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ గారు, కుమారుడు శ్రీ సుధీర్‌రెడ్డి గారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో శ్రీ సిద్దారెడ్డి జనార్ధన్‌రెడ్డి గారి విగ్రహ ఆవిష్కరణ, ఆధ్యాత్మిక ప్రవచనము భగవత్సంకీర్తన నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.